క్లుప్తంగా

దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడానికి ఆహ్వానం

మహబూబాబాద్: ప్రజాపాలన దరఖాస్తులు అన్‌లైన్ చేసేందుకు ఆసక్తి గల వారు ఈనెల 8న ఉదయం 8గంటలకు మున్సిపాలిటీ కార్యాలయానికి రావాలని కమిషనర్ టి. ప్రసన్న రాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దరఖాస్తుల అన్‌లైన్ చేయాలని ఒక్క దరఖాస్తుకు రూ.15 ఇవ్వడం జరుగుతుందన్నారు. సొంత ల్యాప్‌టాప్ లేదా అందుబాటులో గల కంప్యూటర్లతో కార్యాలయానికి రావాలన్నారు.

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ



గూడూరు: గూడూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఆదివారం వరంగల్ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి 4 వెండి, 4 కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం స్వరూప, ఉపాధ్యాయులు సీఆర్‌పీలు శోభన్‌రెడ్డి అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆదివారం 1990–91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వెంపటి సీతారాములు, యూసుఫ్, సంద్రగిరి కృష్ణమూర్తి, భాస్కర్, నాగలక్ష్మి, అరుణ, రామస్వామి, మధు, కృష్ణ, శ్రీధర్, అఫ్జల్ పాల్గొన్నారు.

శ్రీరామ జాగరణ యాత్ర



మహబూబాబాద్ రూరల్: దళిత హిందూ పరిషత్ శ్రీరామ జాగరణ యాత్ర సందర్భంగా పట్టణంలోని ముత్యాలమ్మ గుడిలో పరిషత్ ప్రతినిధులు ఆదివారం పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గొర్రె చిట్టిబాబు, ఇరుకుల్ల లక్ష్మి, పుచ్చకాయల ఉదయమ్మ, సాయిలమ్మ, భారతమ్మ, రాయపురం సాంబయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

పంటకు చీరల రక్ష



పెద్దవంగర: పండించిన పంటలను చీడపీడల నుంచి కాపాడేందుకు ఎరువులు, పురుగుల మందులు వాడే రైతులు పశువులు, కోతులు బెడదనుంచి కాపాడేందుకు నానా కష్టాలు పడుతున్నారు. మండల పరిధిలోని బావోజీ తండాకు చెందిన ఓ రైతు తను సాగు చేసిన మిర్చిపంటకు రక్షణగా పాత రంగురంగుల చీరలను ఇలా ఉపయోగించాడు.

ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

- 2019 జనవరిలో జరిగిన ఎన్నికలు
- ఈనెల జనవరి 31తో ముగుస్తున్న పదవీ కాలం
- నిధులు లేక ఎక్కడిక్కడే ఆగిన అభివృద్ధి పనులు
- బిల్లులు చెల్లింపుల జాప్యంతో సర్పంచ్‌ల ఆందోళన
- మంత్రి సీతక్కను కలిసిన సంఘం నాయకులు
- మరో ఆరునెలలు పొడించాలని విన్నపం



మరిపెడ రూరల్: అమృతండా జీపీ భవనం

మహబూబాబాద్/మరిపెడ రూరల్: గత పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో పూర్తి అయ్యాయి. దానిని బట్టి సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే నెల 1వ తేదీతో ముగుస్తుంది. కానీ నేటి వరకు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఏది కూడా ప్రారంభం కాకపోవడంతో ముందుగా పార్లమెంట్ ఎన్నికలు జరిగే పరిస్థితి కన్పిస్తోంది. దీంతో అన్ని పార్టీలు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి పెట్టి కసరత్తు చేస్తున్నాయి. అదే జరిగితే ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే. సర్పంచ్‌ల సంఘం నాయకులు మాత్రం కోవిడ్ మూలంగా నష్టపోయామని మరో ఆరు నెలలు గడువు ఇవ్వాలని సంబంధిత మంత్రి సీతక్కను కలిసినట్లు చెబుతున్నారు. త్వరలోనే స్పెషల్ ఆఫీసర్‌ల పాలన వచ్చే పరిస్థితి కన్పిస్తుంది.

జిల్లాలో గత ఎన్నికల సమయంలో 16 మండలాలు ఉన్నాయి. 461గ్రామపంచాయతీలు ఉండగా మొత్తం ఓటర్లు ఆ ఎన్నికలను బట్టి ఎస్టీ 1,99,977 ఎస్సీ 66,619, బీసీలు 1,96,669, ఇతరులు 35,530, మొత్తం 4,95,795 మంది ఓటర్లు ఉన్నారు. చాలామంది సర్పంచులు రూ.లక్షలు అప్పు చేసి అభివృద్ధి పనులు చేశారు. కొన్ని చోట్ల చెక్కులు పంపించినప్పటికీ పాసింగ్ కాక నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో కోట్లల్లో ఉన్న గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు వస్తాయా.. లేదా అనే అనుమానంతో సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కౌంట్‌డౌన్ ప్రారంభం..

మహబూబాబాద్ జిల్లాలో 461 గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసే గడువు రోజు రోజుకు దగ్గర పడుతోంది. కేవలం 24 రోజులు మాత్రం గడువు ఉంది. అంటే జనవరి నెల 31తో వారి పదవీ కాలం అయిపోతుండడంతో చేసిన పనులకు బిల్లుల పరిస్థితి ఏమిటో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గాలు ఏర్పడిన తర్వాత కరోనా వెంటాడి రెండేళ్ల పాటు ఏమి చేయలేని పరిస్థితుల్లో సర్పంచులు ఉన్నారు. బిల్లుల బకాయిలు చెల్లించకుంటే గ్రామ పంచాయతీ ఎన్నికల తర్వాత కొత్త పాత వారికి మధ్య బేధాభిప్రాయాలతో పల్లెల్లో మరో పంచాయతీ మొదలైయ్యే అవకాశాలు ఉంటాయని పలువురు చెబుతున్నారు.

పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



జిల్లాలోని అన్ని పంచాయతీల సర్పంచులను అధికారులు వేధించి పనులు చేయించారు. కానీ బిల్లుల చెల్లింపు విషయంలో మాత్రం పట్టించుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం వెంటనే సర్పంచులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించే ఏర్పాటు చేయాలి.

– గుగులోతు సూరనాయక్, సర్పంచ్, వెంకట్‌తండా, మరిపెడ

సంక్రాంతి తర్వాత ఆదేశాలు వచ్చే అవకాశం

పంచాయతీలు ఎన్నికల విషయంలో ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఓటర్ల జాబితాను మాత్రం సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరితో 1తో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుంది. స్పెషల్ ఆఫీసర్‌లను కేటాయిస్తారా.. ఇంకా ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అనే విషయంపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటాం. సంక్రాంతి పండుగ తర్వాత ఆదేశాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి

– హరిప్రసాద్, డీపీఓ

జిల్లాకు పేరు తీసుకురావాలి



మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులతో ఎమ్మెల్యే మురళీనాయక్

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ అర్బన్: క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని జిల్లాకు పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం మహబూబాబాద్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ ఎంపికలకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులతోని కబడ్డీ ఆడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మద్ది వెంకట్ రెడ్డి, సెక్రటరీ తోట సురేష్, గౌరవ అధ్యక్షుడు సంద వీరన్న, ఉపాధ్యక్షుడు గంధసిరి శ్రీను, బాధ్యులు యాకాంబ్రం, సతీష్, వ్యాయామ ఉపాధ్యాయులు చాప్లనాయక్, జ్యోతి, శరత్, వరప్రసాద్, రాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజీ వాకర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే డాక్టక్ భూక్య మురళీనాయక్ ఆవిష్కరించాడు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాస్, నాగయ్య, అధ్యక్షుడు నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోశాధికారి పట్టాభి లక్ష్మయ్య పాల్గొన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

మహబూబాబాద్ రూరల్: విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (వేవా) జిల్లా శాఖ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించాడు. కార్యక్రమంలో వేవా జిల్లా శాఖ అధ్యక్షుడు దొంతోజు ఓంకార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నోజు విజయ్ కుమార్, కోశాధికారి ఉల్లి విద్యాసాగర్, గౌరవ అధ్యక్షుడు తేలుకుంట్ల ఉపేంద్రాచారి, వలబోజు సోమయ్య, గౌరవ సలహాదారులు ఎర్రోజు లక్ష్మణాచార్యులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

జిల్లా కేంద్రం శివారులోని హైమా గార్డెన్స్ సమీపంలో గల ఎల్లద్దాయ్ చర్చికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ పాస్టర్ అనుదీప్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

సెలవు దినంగా ప్రకటించాలి

బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని ప్రకటించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌కు సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్, జిల్లా అధ్యక్షుడు నందులాల్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

తొర్రూరు రూరల్/తొర్రూరు: ప్రజాసేవ కార్యక్రమాలను మరింత విస్తరింపజేస్తూ వాసవీ క్లబ్ తొర్రూరు అన్నివర్గాల ప్రజల మన్ననలను పొందాలని పాలకుర్తి ఎమ్మెల్యే హనుమాండ్ల యశస్వినిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని వెలికట్ట గ్రామ శివారులోని రామ ఉపేందర్ గార్డెన్‌లో నిర్వహించిన క్లబ్ నూతన ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో యశస్విని రెడ్డి మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన బిజ్జాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా చొడవరపు రాము, కోశాధికారిగా వల్లపు మధులతోపాటు వాసవి అన్నపూర్ణ, వాసవీ కపుల్స్ క్లబ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ యాద నాగేశ్వర్‌రావు, మాజీ అధ్యక్షులు వజినపెల్లి దీపఅనిల్‌కుమార్, మచ్చ సురేష్, విశ్వప్రకాష్, రేవూరి శ్రీనివాస్, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మహబూబాబాద్ రూరల్: కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడు ముదిగిరి బీరయ్య మహబూబాబాద్ మండలంలోని ఉత్తరతండా జీపీ పరిధిలోని గుర్రాలగుట్ట తండా వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టగా ఆయన తలకు, ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో బాధితుడి భార్య లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపారు. తీవ్రగాయాలైన బీరయ్యకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స చేశాక పరిస్థితి విషమంగా వైద్యుడు తెలపడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ తీసుకువెళ్లారని పేర్కొన్నారు.

గ్రామపంచాయతీ కాకుండా అడ్డుకున్నారు..



శవయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

మరిపెడ రూరల్: జర్పులతండా కొత్త గ్రామ పంచాయతీ కాకుండా కొందరు నాయకులు అడ్డుకున్నారని ఆరోపిస్తు మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామ పంచాయతీ శివారు జర్పులతండాలో జీపీ వ్యతిరేకుల దిష్టిబొమ్మతో ఆదివారం గ్రామ పురవీధుల్లో శవయాత్ర చేపట్టారు. అనంతరం తండాలోని కూడళ్లలో దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జర్పులతండాలోని నిరసనకారులు మాట్లాడుతూ.. అప్పటి డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మంత్రి సత్యవతిరాథోడ్ కలిసి కొత్త జీపీ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదించిన డోర్నకల్ నియోజవర్గంలోని సుమారు 15 కొత్త గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కానీ జర్పులతండా పేరు మాత్రం లేదని వారు వాపోయారు. ఇదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుకున్నారని వారు ఆరోపించారు. అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి అడ్డుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపేందర్, కేవుల, నరేష్, వెంకన్న, రామకిషన్, లోక్య, శ్రీను, జర్పుల నరేష్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. పెరిగి ధరలకు అనుగుణంగా గ్రామ పంచాయతీ వర్కర్స్ వేతనాలను రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై చర్చించేందుకు వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పాడియా బీకు, ఇరేల్లి మల్లేష్, గుండాల సోమనర్సయ్య, కొమిర బాలయ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

చదువులో రాణిస్తే మంచి భవిష్యత్



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సుధాకర్

గార్ల: చదువుల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా ఏఎస్‌డబ్ల్యూఓ సుధాకర్ అన్నారు. ఆదివారం గార్లలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో వ్యక్తిత్వ వికాసము, విద్యలో నైపుణ్యం, మెళకువల గురించి ఆయన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇష్టపడి చదవడంలో అనుకూల ఆలోచన విధానం గురించి వివరించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు సెల్‌ఫోన్ల జోలికి వెళ్లకుండా కష్టపడి చదువుకొని ఉన్నత ఫలితాలు సాధించాలని కోరారు. ఉన్నత చదువులు చదువుకొని దేశసేవ చేయడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. హాస్టల్ వార్డెన్ ముత్తమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎయిడ్స్‌పై అవగాహన

దంతాలపల్లి: ఎయిడ్స్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని సంస్థ మానిటరింగ్ అధికారి రాయిశెట్టి యుగేందర్ అన్నారు. ఆదివారం సర్వోదయ యూత్ ఆర్గనేజేషన్ స్వచ్ఛంద సంస్థ, రాష్ట ఎయిడ్స్ నియంత్రణ మండలి, ఉమ్మడి వరంగల్ జిల్లా నియంత్రణ మండలి వారి సహకారంతో ఎయిడ్స్‌పై మండ మండలకేంద్రంలో కళారంజని కళాజాత వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమంల నిర్వహించారు. కళాకారులు రమేష్, అర్జున్, కృష్ణంరాజ్, సదయ్య, పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు

గూడూరు: మండలంలోని మర్రిమిట్టకు చెందిన కాంగ్రెస్ నాయకులు యొట్టి వెంకన్న తన అనుచరలతో కలిసి ఆదివారం కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మానుకోట ఎంపీ అభ్యర్థిగా తన బయోడెటాను అందించినట్లు వెంకన్న తెలిపాడు.

క్రీడల్లో రాణించాలి



కేసముద్రం: ప్రతి ఒక్క విద్యార్థి చదువుతోపాటు, క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, ధన్నసరి సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న అన్నారు. మండల కేంద్రంలో కేపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రావుల మురళీ, ఓలం రమేష్, అల్లం గణేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కురవి: నేడు(సోమవారం) కురవి మండల సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరస్వతీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ హాజరవుతారని తెలిపాడు.

ఆర్థికసాయం

కేసముద్రం: మండల కేంద్రంలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన అశోక్ అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. ఈమేరకు ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ పంపిన రూ.5వేలను ఆదివారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పోలెపల్లి వెంకట్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.

ప్రభుత్వ సాయం అందేలా చూస్తా

కొత్తగూడ: మండలకేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజం సారంగంను సీతక్క కోడలు కుసుమాంజలి ఆదివారం పరామర్శించారు. చికిత్సకు కావాల్సిన సాయం మంత్రి సీతక్క సహకారంతో ప్రభుత్వం ద్వారా అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ మల్లెల రణధీర్ ఉన్నారు.

పరామర్శ

తొర్రూరు రూరల్: బీఆర్‌ఎస్ కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద మంగ్యా తండాకు చెందిన మాజీ ఎంపీటీసీ జాటోతు బీకునాయక్ అనారోగ్యంతో తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా దయాకర్‌రావు పరామర్శించాడు. సర్పంచ్ జాటోతు శారదరమేష్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎస్సైకి సన్మానం



గార్ల: గార్ల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మతోట జీనత్‌కుమార్ ను ఆదివారం గార్ల ఫర్టిలైజర్ దుకాణం యజమానులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు లింగాల ఉమేష్, తిరుపతిరావు, సాయిలు, నర్సింహరావు, మాలోత్ రమేష్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై దీపికరెడ్డికి శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డిని బీఆర్‌ఎస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు నలమాస సుధాకర్, జంగిలిగొండ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి పూజల శ్రీనివాస్, జీపీ వార్డు సభ్యుడు కొమ్మురాజుల సంజీవ, వీరేందర్, సుమన్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

గోదాదేవి పెళ్లి కుమార్తె వేడుకలు



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజల్లో భాగంగా మహబూబాబాద్ పట్టణంలోని శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయంలో గోదాదేవి అమ్మవారి పెళ్లి కుమార్తె వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై లక్ష్మీనారాయణ చార్యులు ఆధ్వర్యంలో భక్తులు గోదాదేవి అమ్మవారి సేవలో తరిస్తున్నారు. ఈనెల 13వ తేదీన సమ్మాళ్వార్ స్వామివారి పరమపదోత్సవం ఉంటుందని అర్చకులు తెలిపారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

కేసముద్రం: మండలంలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన అశోక్ అనే వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. ఈమేరకు ఆదివారం బాధిత కుటుంబానికి 50కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులను సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ అందజేశారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన అశోక్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, వల్లందాసు రవి, కొమ్ము రాహుల్, కీర్తి సురేందర్, ఎన్నమాల మహేందర్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా అష్టోత్తర పూజలు

గార్ల: ధనుర్మాసోత్సవాల సందర్భంగా గార్లలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో 41పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణుసహస్రనామం పఠించి గోదాదేవికి అష్టోత్తర పూజలను ఘనంగా నిర్వహించారు. వడ్డె వెంకటేశ్వర్లు ఈశ్వరమ్మ, రత్నకిషోర్ పల్లవి, ఉదయ్‌కుమార్ నాగవాణి దంపతులు గోదాదేవి పట్టువస్త్రాలు సమర్పించారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ



మహబూబాబాద్ రూరల్: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



గూడూరు: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలతో రామ భక్తులు



బయ్యారంలో శోభాయాత్ర..



కొత్తగూడలో..



గార్ల: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



చిన్నగూడూరు: విస్సంపల్లిలో..

అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను ఆదివారం రామభక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ అక్షింతలను ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ చేసిన అనంతరం హిందువులు తమ ఇళ్లలో తలపై అక్షింతలు చల్లుకోవాలని సూచించారు. అదే రోజు రాత్రి ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల ఎదుట 5దీపాలు వెలిగించి దీపావళి పండుగ చేసుకోవాలని తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్

బీఆర్‌ఎస్‌కు జెడ్పీటీసీ రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న జెడ్పీటీసీ

చిన్నగూడూరు: చిన్నగూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు సునీత మురళీధర్‌రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మండలంలోని గుండంరాజుపల్లిలో ఆదివారం తన అనుచరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. డోర్నకల్ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు రెడ్యా ఏకపక్ష నిర్ణయాలతో పదవీ ఉండి పనిచేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. నిత్యం భజన చేసే నాయకులకే ప్రాధాన్యత ఉంది కానీ, పని చేసే కార్యకర్తలను రెడ్యా గుర్తించ లేదని తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యాకు పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సలీమా గంగన్న, ఎంపీటీసీ చెక్కల మమత, కార్యకర్తలు పాల్గొన్నారు.